# ఇదీ కథ

"ఏం మామా! యీ నెల అంతా మనకు అఖండ రాజయోగం. జన్మలగ్నానికి ఫలితం శత్రు నాశనం అని కూడా అన్నాడండోయ్! ఇదుగో, వెళ్ళి, ఆ.... రొదుతున్నాడే, వాడితో 'ఖబడ్దార్' నీ గుండెల్లో నిద్రపోతా"నని చెప్పి వస్తా—శుభం—

రోజూ, నాకు ఆ పనస వినడం అలవాటైపోయింది. కాని అప్పుడే రైలుదిగి వచ్చిన ఆ స్నేహితుడికి అందులో వున్న గుండెకోత ఏం తెలుస్తుంది? ఏమిటి ఆ వాలకం, ఎవరు ఆ మనిషి, ఏమిటి ఆ మాటలకు అర్థం? అనుకుని తెల్లపోతూ, ఏమీ అడగలేక, ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు.

అతన్ని సముదాయించటానికని, మళ్ళా ఓ మారు ఆ కథ అంతా ఏకరువు పెట్టాలి—

— పాపం, అతడు చాలా మంచివాడోయ్, నోట్లో నాలుక లేనంతటి అమాయకుడు. నలుగురికీ తలలో నాలుకలాగా మెలగుతూ, ఒక జోలీ శొంఠీ అక్కర లేకుండా,పదిమంది సంపన్న గృహస్థుల యిళ్ళల్లో పౌరోహిత్యం చేసుకుంటూ, నాలుగు డబ్బులు కూడవేసుకుంటూ, ఓ యింటివాడై యింటిపట్టున సుఖంగా కాలక్షేపం చేస్తూండేవాడు.

— నిజంగా అవసరం ఏమీలేదు సుమా? అదివరకు ఎన్నడూ అలాటి వెర్రి మొర్రి నమ్మకాలు ఉన్నాయో, లేవో కూడాను. కుడిచి కూర్చుని ఊరక ఉండ లేనట్టుగా, రామన్న ఊళ్ళోకి ఎవడో కొత్తజోస్యుడు దిగేటప్పటికి, తన జాతకం చూపించు కున్నాడు. అక్కడితో మునిగింది.

ఆ అప్రాచ్యుడు—వాడెవడో బిళ్ళకుడుముల్లాగ రెండు రూపాయలు చేతులో వేయించుకుని—ద్వికళత్రయోగం ఉన్నదని చెప్పాడు. రామన్న నిలువునా నీళ్ళు కారి పోడూ?

ఇక, అక్కడనుంచి చూసుకో, కాలుకాలిన పిల్లిలాగా, తందనాలు తొక్కడం మొదలు! పోనీ ఎవరితోనైనా మనసువిప్పి, 'ఇలాటి ఆపద వచ్చేటట్టుంది, ఏమిటి ఉపాయం?' అని అడిగినా బాగుండిపోను. రంభా గర్భంచేసి కప్పిపెట్టాడు. నాలిక దాటిందంటే నాలుగువాడలూ దాటి, తన యిల్లాలి చెవిని ఎక్కడ పడుతుందో, ఆ వార్త వినగానే ఆ అమ్మాయి అప్పుడే గుటుక్కు మంటుందేమోనని, నోరు నొక్కుకుని - సొంత వైద్యం మొదలు పెట్టాడు.

హరి ః ఓం అంటూ ఆదిలోనే పెద్ద హంసపాదు వచ్చింది. సిసలైన శ్రోత్రియుడు, పరాయి ఆడదానికేసి కన్నెత్తి చూడటమన్నా అలవాటు లేనివాడు, చూస్తూ చూస్తూ ఒక్కసారిగా - ఎంత తెగించినా - గంగలో ఎలా ఉరుకుతాడు? అందువల్ల, నాలుగు రోజులు నానా మారాముళ్ళు పడి, ఎలాగైనా, తన యింట దీపం నిలుపుకోవాలని - కొంచెం గడుసరిగా అనుకుని — ఓ పన్నాగంలోకి దిగాడు.

అంతవరకూ చక్కని అనుకూల దాంపత్యం, చిలకా గోరింకలాగా చూడ ముచ్చట అయేది ఉభయులనూ. ఒక్కసారిగా కటిక కోరంటికంలోకి దిగి, ఆమె వంకన్నా చూడకుండా, కాల్చుకు తినడం ప్రారంభించాడు. కొంత కాలమైనా అలా అంటీ ముట్టకుండా, పరాయిదానికన్నా కూడా కనాకష్టంగా చూస్తే — తన గుండెలు ఎంత కుమిలిపోయినా - తన భార్య బ్రతికి బాగుంటుంది కదా అని ఆ బ్రాహ్మ ణుడి ఆశ.

అది ఆ చిన్నదానికి ఏం అర్థమౌతుంది? మొదటి రోజు కసిరి కరవ వచ్చి నట్టుగా మీదకు వస్తే, చెంపకు చారెడు కళ్ళు చేసుకుని బెదిరిపోయినా, అప్పటి కేలాగో-

ఏదో చిరాకుగా వుండి అలా మండిపడుతున్నాడని - సమాధాన పరచుకుని ఊరుకుంది; కాని, రోజూ ఎప్పటికప్పుడు అదే తంతు అయేటప్పటికి బెంగతో హడలిపోయి మంచం ఎక్కింది.

అక్కడితోనైనా, కళ్ళు తెరచి, రామన్న పిచ్చివేషం వేయకుండావుంటే బాగుండిపోనేమో? ఏం చేశాడనుకున్నావు? ఆ ఉపశాంతికి గ్రహచారం లొంగక పోగా, నెత్తి అణచడానికి కూర్చున్నట్టుంది, అందుకనే, నిక్షేపంలాంటిది అలా లోజెడిపోతూన్నది. ఇక తామసించకూడదు, అని నడుం కట్టుకుని — లోతుగా మునిగాడు.

అవును మరి, ఇక ఊరుకుంటాడా, పరమేశ్వరుడిమీద భారంవేసి, పదిరోజులు ఉద్దుకుడుచుకుని, చివరకు సాహసించి, పళ్ళ బిగివిని, ఎలాగైతేనేం పనిచేసే మంగాయ్ అని వుందిలే — ఆనక చూపిస్తానుండు - దానిమీద చేయి వేశాడు. అవును అంతకన్న ఎక్కడికి వెతుక్కుంటూ పోతాడు. అలాటి కార్యకలాపానికి తూర్పు ఏదో పడమర ఏదో అదివర కెన్నడయినా ఎరుగున్న పాపాన పోయివుంటేనా? అందు బాటులో వున్నది—అది వాడి పూర్వ సుకృతంకొద్దీ - అందింది.

ఇక పీడ వదలిపోయిందికదా అని ఎగిరి గంతులు వేశాడంటే నమ్మ.

మూడునాళ్ళ పట్టపగలు - ఎలాగో మొక్కు తీర్చుకుని బయటపడ్డాడనుకో. అసలు రెపరెప అంతా అందుకు కాదుగా - మంచిరోజు చూసి - మళ్ళా యింట్లో మంచం దులిపాడు.

ఒకరోజు, రెండు రోజులు - ఆ అమ్మాయి ఏ మాత్రమూ తేరుకోకపోవడం అలా ఉండగా, మరీ, కారు కమ్ముకుని, దిగనాసిల్లిపోయింది. అప్పటికైనా మేలు కున్నాడా! తగిన ఉపశాంతి జరిగిందికదా - అనే ధైర్యంతో దానంతట అదే, భారకం తగ్గి లేచి తిరుగుతుందని—జబ్బు ఒకటైతే-వైద్యం ఒకటిగా లంకణాలు కట్టి మాడ్చి చివరకు, అత్తవారికి కబురు చేశాడు.

మామగారు వచ్చీ రావడంతోనే వైద్యుణ్ణి పిలుచుకువచ్చి చూపించాడు. అతడు ఆయనను చాటుకు తీసుకువెళ్ళి, ఏం చెప్పాడో! ఆయన, రామన్నతో మళ్ళా పలు విప్పకుండా, తన భార్యచేత చెప్పించి, ఇక అక్కడ గంగ ముట్టకుండా, ఆ పూటే కూతురిని తన ఊరు తీసుకు వెళ్ళిపోయినాడు.

— వారంరోజులు అయినా, అక్కడనుంచి ఏ కబురూ లేదు. మనసు పట్టలేక, రామన్న తాను కూడా రైలు ఎక్కాడు. గుమ్మంలో అడుగు వేసేటప్పటికి ఎలాగు ఉన్నదిటా స్థితి—ఇల్లంతా అలగోలు బాలగోలు. అప్పుడో కాస్సేపో—

అంత గంగిగోవులాంటి సాధువు - అమాంతం ఆ మామగారిమీద విరుచుకు పడ్డాడు. "అంత ముంచుకు వచ్చినా తనకు కబురెందుకు చేయలే"దని. ఆయన ఉగ్రుడై పోయి, "చేసిన నిర్వాహకం చాలక ఏ ముఖం పెట్టుకు నా గడప త్రొక్కుతావని కబురు చేస్తాను?" అనగానే, రామన్న సగం చచ్చి, గుడ్లనీరు కుక్కుకుంటూ-భార్య మంచం దగ్గిరకు వెళ్ళాడు. చుట్టూ ఎవరెవరో కూర్చుని వున్నారు. ఎవరూ వైదొలగి అతన్ని దగ్గిరకు వెళ్ళనీయలేదు. అంత దూరంగా అలా నిలుచున్నాడు.

— తల్లి వంక చూస్తూన్నది అంతసేపూ - అలికిడికి కాబోలు నెమ్మదిగా మెడ అతడు వున్నవేపు తిప్పి - పెనిమిటి కంట పడగానే - అంత నీరసంలోనూ మెడ విరుగుతుందేమో అన్నంత దుడుకుగా తల విసిరి త్రిప్పుకొని - విపరీతంగా మూలిగింది. అందరూ, అతనివేపు తిరిగి - బాకులలాటి చూపులతో గ్రుచ్చి గ్రుచ్చి అక్కడనుంచి తరిమేశారు.

— రామన్న వచ్చేసిన తరువాత ఒక గంట మాత్రం ఆమెకు ఊపిరి ఉన్నదట—

అంతటితో పోయిందనుకున్నావా? ఆ వరుస వరుస - రామన్న మూడు నెలలు ఆస్పత్రిలో వుండి—మళ్ళా తల్లి కడుపున పుట్టాడనుకో. అతడి పాపం - కొంచెం ఆలస్యంగా ఫలించింది—అప్పట్లో రాలి పోయినా—అదృష్టవంతుడే.

— ఒకరిని ఓ మాట అనడు, పలుకనడు. ఎప్పుడూ ఒకటే ధోరణి 'గ్రహబలం'. అలా అనుకోవడమే ఆ వెర్రికి బలం. అసలు సంగతి గ్రహించే మతి వుంటేనా—అసలు గుండె లాదేవా?

ఇప్పుడు ఇదో మాదిరి—ఏ పత్రిక చదివో—పంచాంగం చూశో—నెలవారీ, రోజువారీ ఫలితాలు కట్టుకోవడం—అది యింటింటా చెప్పి రావడం. విన్నావు కదూ "శత్రు నాశనం" అట. శత్రువు ఎవరో తెలుసునా, ఆ....కొడుకన్నాడు—మామగారు.

ఇదీ—కథ.